క్లుప్తంగా

విద్యుత్ అధికారుల విచారణ



డోర్నకల్/నెహ్రూసెంటర్: స్థానిక మున్నేరు వాగు సమీపంలోని 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో ఆదివారం విద్యుత్ అధికారులు విచారణ జరిపారు. శనివారం 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సమయంలో అసిస్టెంట్ లైన్‌మన్ బి.క్రాంతికుమార్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విద్యుత్ శాఖ సీఈ రాజుచౌహాన్ ఆధ్వర్యంలో ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఈ వెంట డీఈ విజయ్, ఏడీఈ రమేష్, ఏఈ కిరణ్ తదితరులు ఉన్నారు.

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని రాము తండాజీపీ శివారు వీరారెడ్డిపల్లి సమీపంలోని పంటక్షేత్రంలో జరిగిన ఘటన స్థలాన్ని విద్యుత్ సీఈ రాజుచౌహాన్ పరిశీలించారు. ఆయన వెంట ఏడీఈ ప్రశాంత్, ఏఈ రాజు, లైన్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

కవి పరమేశ్వర్‌కు సన్మానం



పెద్దవంగర: మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి బిర్రు పరమేశ్వర్‌కు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి కవి సమ్మేళనం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈసాహిత్య వేదికపై నూతన భావాలకు ప్రతిధ్వనిగా పరమేశ్వర్ తన కవితా గానాన్ని వినిపించి విశేషంగా ఆకట్టుకున్నారు. ప్రముఖ సినీనటి శ్వేత బసరాజ్, అంతర్జాతీయ ప్రోగ్రాం కన్వీనర్ ధనాశి ఉషారాణి చేతుల మీదుగా పరమేశ్వరు నంది అవార్డు, ప్రశంస పత్రం అందుకుని సన్మానం పొందాడు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి



మాట్లాడుతున్న మాణిక్యరాజ్

డోర్నకల్: మాలలు ఐక్యంగా ఉంటూ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు చిలకబత్తిని మాణిక్యరాజ్ కోరారు. స్థానిక జయపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాలలంతా ఐక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఉమ్మడిగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పగిడిపల్లి వీరరాజు, జాన్‌వెస్లీ, మెంటం సుకుమార్, నీరుడి మణెమ్మ, నాని, రవికాంత్ పాల్గొన్నారు.

18న 'చలో హైదరాబాద్'

నెహ్రూసెంటర్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 18న ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి పిలుపునిచ్చారు. సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ సర్కిల్‌స్థాయి సమావేశంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ.. విద్యుత్‌సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ప్రసాద్, ఆకుల రాజు, కుంట ఉపేందర్, వెంకటరాజు, శ్రీనివాస్, ఉమేష్, నీలం శ్రీనివాస్, పిల్లి వెంకటేశ్వర్లు, వీరభద్రం, అక్కినపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వనభోజనాలకు గ్రామస్తులు



నెల్లికుదురు: వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామస్తులంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ఆదివారం మండలంలోని మదనతుర్తి గ్రామంలోని పరిసర ప్రాంతంలో గ్రామ ప్రజలు వన భోజనాలకు తరలివెళ్లారు.

జమాండ్లపల్లిలో..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో మున్నూరుకాపు కుల సంఘ సభ్యులు ఆదివారం వనభోజనాలకు వెళ్లారు. సంఘ సభ్యుల ఐక్యత, ఊరి ప్రజల యోగక్షేమాలు బాగుండాలని, రైతన్నల కోసం వర్షాలు సకాలంలో పడాలని ఆకాంక్షించి వన భోజన కార్యక్రమం నిర్వహించినట్లు మున్నూరుకాపు కులసంఘం నాయకులు పేర్కొన్నారు.

మూడేళ్లుగా అద్దె భవనంలోనే..

- నిలిచిన పాఠశాల నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



నిర్మాణ పనులు నిలిచిన పాఠశాల భవనం



అద్దె గదిలో కింద కూర్చున్న విద్యార్థులు

డోర్నకల్: మండలంలోని హూన్యాతండా ప్రభుత్వ పాఠశాలలో వసతుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు సంవత్సరాలుగా కనీస వసతులు లేక విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా అవస్థలు పడుతున్నారు. మన ఊరు, మన బడి పథకంలో భాగంగా నూతనంగా చేపట్టిన భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడతో మూడేళ్లుగా పాఠశాల నిర్వహణ అద్దె భవనంలో కొనసాగుతోంది.

నిలిచిన నిర్మాణ పనులు..

హూన్యాతండాలో రూ.20లక్షల నిధులతో పాఠశాల భవనం, మరో ఐదు లక్షల రూపాయలతో ప్రహరీ, టాయిలెట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణ పనులకు 2022 ఏప్రిల్ 6న అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులు 80శాతం పూర్తయి, టాయిలెట్లు, ప్రహరీ పనులు ప్రారంభం రాలేదు. పంచాయతీరాజ్ అధికారులు పూర్తయిన పనులను సకాలంలో రికార్డు చేయకపోవడంతో తమకు బిల్లులు రాక పనులు నిలిపివేశామని, బిల్లులు మంజూరు చేస్తే వెంటనే పనులు పూర్తి చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ తెలిపాడు.

అద్దె భవనంలో పాఠశాల నిర్వహణ..

పాత భవనం తొలగించి కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించడంతో మూడేళ్లుగా అద్దె గదిలో పాఠశాల కొనసాగుతోంది. నెలకు రూ.వెయ్యి చొప్పున గ్రామపంచాయతీ నుంచి అద్దె చెల్లిస్తుండగా నిధుల కొరతతో ఆరునెలలుగా అద్దె చెల్లించడం లేదు. అద్దె గదికి సంబంధించి విద్యుత్, తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం లేక విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గదిలో ఫ్లోరింగ్ ధ్వంసమవడంతో విద్యార్థులు కూర్చోడానికి ఇబ్బందులు పడుతున్నారు.

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య..

గత సంవత్సరం పాఠశాలలో 17మంది విద్యార్థులు ఉండగా వీరిలో నలుగురు ఐదో తరగతి పూర్తి చేసి వెళ్లిపోయారు. ప్రస్తుత సంవత్సరం బడిబాట కార్యక్రమం ద్వారా 12నుంచి 15మంది వరకు విద్యార్థులు పాఠశాలలో చేరే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుని విద్యార్థులకు పూర్తిస్థాయి వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వసతులు లేక ఇబ్బందులు



అద్దె గదిలో వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం లేదు. అద్దె గది కూడా సౌకర్యవంతంగా లేదు. నూతన భనాన్ని వెంటనే పూర్తి చేయాలి.

– తాళ్లపల్లి రమేష్, హెచ్ఎం

మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

నెహ్రూసెంటర్: ఆగస్టు 30, 31వ తేదీల్లో గార్ల మండలంలో జరగనున్న జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జగన్నాథ భవనంలో రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు జి.పాండు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌ల రద్దుతోపాటు ఇతర డిమాండ్ల సాధన కోసం జూలై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, నర్సింహరావు, అప్పిరెడ్డి, ఉపేందర్, రాములు, సుధాకర్, రాజు, నాగన్న పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



బయ్యారం: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బయ్యారం: మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఈనెల 17న హైదరాబాద్‌లో శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఊకే పద్మ, పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుడుం వీరభద్రం అన్నారు. ధర్నా పోస్టర్లను ఆదివారం బయ్యారంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, వీరభద్రం, సంగన్న, ఐలయ్య, శేషు పాల్గొన్నారు.

గార్ల: మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు జడ సత్యనారాయణ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన హైదరాబాద్‌లో జరిగే మహాధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సక్రు, మనోహర్, మాన్యా, ఐలమ్మ, లక్ష్మి, సైదులు, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

డోర్నకల్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. జూన్ 17న హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నా పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు యాసా వెంకటనారాయణ, లింగ్యా, గుజ్జు దేవేందర్, శ్రీనివాస్, దాసరి మల్లేశం పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కేసముద్రం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తుంపిళ్ల శ్రీనివాస్ అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను పేదరికం నుంచి దూరం చేసి, మధ్య తరగతి ప్రజలుగా మార్చిన గొప్ప నాయకుడు పీఎం నరేంద్ర మోదీ అన్నారు. మోదీ చేపడుతున్న దేశాభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్, ప్రధాన కార్యదర్శి బోగోజు నాగేశ్వరాచారి, ఉపేందర్, నాగయ్య, కరుణాకర్, బండి వెంకన్న, శ్రీనివాస్, వెంకటేష్, భాస్కర్, బేతి వెంకన్న, రమేష్, సంపత్, చంద్రకళ, వరుణ్ పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

కురవి: జూన్ 21, 22వ తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే టీయూసీఐ రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిళ్లకంటి సూర్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నర్సయ్య, సైదులు, వెంకటయ్య, మరియ, లక్ష్మి పాల్గొన్నారు.

గంగారం: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఆధ్వర్యంలో జూన్ 21, 22 తేదీలలో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు పూనెం రవి అన్నారు. మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, వసంతరావు, రమేష్, సతీష్, శేఖర్, కల్యాణ్ పాల్గొన్నారు.

బయ్యారం: ఈనెల 21,22 తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహించనున్న టీయూసీఐ రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్లను ఆదివారం బయ్యారంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బిల్లకంటి సూర్యం, ధనుంజయ, శ్రీను, నారాయణరెడ్డి, గుట్టయ్య పాల్గొన్నారు.



కురవి: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సర్వేతో గ్రామాల్లో సమస్యల గుర్తింపు



మాట్లాడుతున్న తేజావత్ జోగ్రాం

గార్ల: ధర్తీ జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలను కల్పించేందుకు గ్రామసభల ద్వారా సమస్యలను గుర్తిస్తున్నట్లు బంజారా సేవా సమితి(బీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ జోగ్రాం తెలిపారు. ఆదివారం మండలంలోని చిన్నబంజర పంచాయతీలో గల 4గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి నుంచి ఈనెల 30 వరకు గార్ల, బయ్యారం మండలాల్లోని గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలను గుర్తించేందుకు సర్వే పూర్తి చేస్తామన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆదేశాల మేరకు కలెక్టర్ బీఎస్ఎస్‌కు గ్రామాల్లో కనీస సౌకర్యాలను గుర్తించేందుకు 2 మండలాలను అప్పగించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో బీఎస్ఎస్ మేనేజర్ సేనా, సిబ్బంది అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అన్న వాటాలో తమ్ముడికి ఇల్లు మంజూరు

బయ్యారం: మండలంలోని సంతులాల్‌పోడుతండాలోని అన్నదమ్ములు ఉరిపెద్ది ముత్తయ్య, సతీష్‌ల ఇల్లు ఉమ్మడి ఆస్తిగా ఉంది. ఇద్దరికి వివాహాలు కావడంతో ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉండగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సమయంలో రెండు కుటుంబాలను ఒకే ఇంటి వద్ద ఫొటోలు తీశారు. ఇందులో చిన్నవాడైన సతీష్ భార్య అరుణ పేరున ఇల్లు మంజూరు కాగా ఆ ఇల్లు ఉన్న స్థలం సతీష్ అన్న ముత్తయ్యకు పంపకంలో వెళ్లింది. కాగా సతీష్‌కు తండాలోనే మరోచోట ఇంటిస్థలం ఉండగా ఆ స్థలంలో ఇంటి నిర్మాణంకు అనుమతి లేదని అధికారులు పేర్కొంటుండడంతో సతీష్ కుటుంబసభ్యులకు ఏమి చేయాలో తోచని స్థితి. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేసి తమ స్థలంలో ఇల్లు కట్టుకునేలా అనుమతి ఇవ్వాలని సతీష్–అరుణ దంపతులు వేడుకుంటున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నర్సింహులపేట: ఆర్థికసాయం చేస్తున్న గ్రామస్తులు



గూడూరు: ఆర్థికసాయం చేస్తున్న బాల్యమిత్రులు

నర్సింహులపేట: తెలంగాణ ఉద్యమ నాయకుడు ఎండీ.ఖాజామీయా భార్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్ ఆధ్వర్యంలో రూ.21వేలు, దేవస్థానం మాజీ చైర్మన్ బొల్లం రమేశ్ అధ్వర్యంలో రూ.9వేలు, మైనార్టీ నాయకులు రూ.17వేలు, ఆటో యూనియన్ అధ్వర్యంలో రూ.2వేల ఆర్థికసాయం చేశారు.

గూడూరు: మండల కేంద్రంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏదుల ఆదినారాయణ పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం మృతుడి బాల్యమిత్రులు, బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థిసాయం అందించారు. అలాగే మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, నాయకులు రూ. 33వేల ఆర్థికసాయం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, నివాళులర్పించారు.

గార్ల: మండలం లోని పెద్దకిష్టాపురం గ్రామ పంచాయతీ కార్మికుడు చెరుకుపల్లి లక్ష్మయ్య కొంత కాలంగా అనారోగ్యంతో మంచం పట్టాడు. ఈమేరకు ఆదివారం అదే పంచాయతీకి చెందిన రిటైర్ట్ ఆఫీసర్ గంగావత్ రాంసింగ్ లక్ష్మయ్యను పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ.15,000 ఆర్థిక సాయం చేశాడు.

కబ్జాకు గురవుతున్న చెరువులను కాపాడాలి



అక్రమంగా మట్టిని తవ్విన గుంతలను చూపిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో చెరువులను కబ్జా చేస్తున్న వారిపై ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు పులుగుజ్జు రమేష్ డిమాండ్ చేశాడు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం చెరువు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. 29ఎకరాల 6గుంటలు ఉన్న ముత్యాలమ్మగూడెం చెరువు.. ప్రస్తుతం 14 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. చెరువులో మట్టిని కొంతమంది నాయకులు అక్రమంగా రాత్రికిరాత్రి తోడేస్తున్నారన్నారు. చెరువులను అధికారులు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గొడుగు ఉపేందర్, నాయిని ఉపేందర్, ఎదుల ఉపేందర్, రేకుల రాయమూర్తి, పులుగుజ్జు శ్రీధర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని అమూల్య గార్డెన్‌లో మండల కేంద్రంలోని రామకృష్ణ ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి రైతువేదికలో నేడు(సోమవారం) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఉగ్గంపల్లి వ్యవసాయ విస్తరణాధికారి శిరీష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

రైతునేస్తంను విజయవంతం చేయండి

బయ్యారం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్న రైతునేస్తం కార్యక్రమంను విజయవంతం చేయాలని తహసీల్దార్ నాగరాజు, ఏఓ రాంజీ రైతులను కోరారు. ఆదివారం వారు ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు. మండలంలోని కొత్తపేటలో రైతువేదిక ద్వారా సీఎం రైతునేస్తం ప్రారంభ కార్యక్రమంను రైతులు వీక్షించే సదుపాయం ఉందని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నెహ్రూసెంటర్: జిల్లాలో గ్రామగ్రామన గద్దెలు నిర్మించి జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోఇన్‌చార్జ్ బుక్కపురం మహేష్ మాదిగా పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సంఘం భవన్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శాగంటి రమేష్, కత్తుల రేణుక, ఎండీ.పాషా, రజియా, కిరణ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, జయరాజ్ పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థిని ప్రతిభ



పెద్దవంగర: నీట్ శనివారం విడుదల చేసిన ఫలితాల్లో పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల రాణి మల్లేశం కుమార్తె రమ్యశ్రీ ప్రతిభ చాటింది. 720మార్కులకు గాను 435 మార్కులు సాధించి సత్తా చాటింది. జాతీయ స్థాయిలో 1,45,996 ర్యాంకును, ఎస్సీ కేటగిరిలో 6,917వ ర్యాంకు సాధించింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లికుదురు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రభుత్వ ఉపాధ్యాయుడు జంజిరాల నాగరాజు అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో విత్తన బంతులను ఆదివారం వేశారు. కార్యక్రమంలో విద్యార్థులు రాజు, విగ్నేష్, సాయి, మహేష్ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం


మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని నర్సంపేట బైపాస్ రోడ్డు నుంచి గూడూరు మండలానికి కంకరచూరతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ ఆదివారం ఒక్కసారిగా అతివేగంతో నవోదయ విద్యాలయ పక్కనగల సెలూన్ షాపు వైపునకు దూసుకువచ్చింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ప్రజలు ఎవరు లేకపోవటంతో పెద్ద ప్రాణనష్టం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



గార్ల: మండలంలోని పూసలతండాకు చెందిన మాలోత్ మారుతిగాంధీపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా ఆదివారం తెలిపారు. పూసలతండాకు చెందిన వివాహిత మాలోత్ సత్య 10రోజుల క్రితం ఆరోగ్యం బాగలేక తన పుట్టింటికి వెళ్లింది. ఈనెల 11న పూసలతండాలోని భర్త వద్దకు వచ్చింది. ఇంటి వద్ద తన భర్త లేడని బంధువులు, చుట్టుపక్కలా గ్రామాల్లో వెతికినా భర్త అచూకీ లభ్యం కాకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్సై భర్త మారుతిగాంధీపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

లక్ష్మిగణపతి హోమం



మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయంలో శ్రీలక్ష్మీగణపతి హోమం పూజలను ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎంవి.కృష్ణప్రసాద్ వేద మంత్రాలతో శ్రీలక్ష్మిగణపతి, రాములోరు సీతమ్మ వారికి పూజలు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

గూడూరు: మహబూబాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే మురళీనాయక్, ఎంపీ బలరాం నాయక్ లక్ష్యమని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, నిరుపేదలందరికీ ఇల్లు ఉండాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. సందర్భంగా నరేష్‌రెడ్డి నియోజకవర్గానికి వెయ్యి ఇండ్లు వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే, ఎంపీతో పాటు మంజూరు చేసిన మంత్రి పొంగులేటికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీనివాస్ మృతి తీరనిలోటు

కురవి: గీత కార్మికుల కోసం నిరంతరం శ్రమించిన శ్రీనివాస్ మృతి గీత కార్మికులకు తీరని లోటని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మండలంలోని రాజోలు గ్రామంలో పోగుల శ్రీనివాస్ సంతాప సభ ఆదివారం నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో టీయుడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, జిల్లా సీపీఐ కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథి, తమ్మెర విశ్వేశరరావు, కట్టెబోయిన శ్రీనివాస్, తోట భిక్షపతి, కరణం రాజన్న, నెల్లూరు నాగేశ్వర్ రావు, సాయిల్‌గౌడు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించండి

గూడూరు: గొల్ల కురుమలు హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం అశోక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వంగపండ్ల మల్లేష్ అధ్యక్షతన మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 22వ తేదీని జిల్లా కేంద్రంలో జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిట్టి వెంకన్న, నూకల సురేందర్, గుండె బోయిన మల్లేష్, గజ్జి మహేష్, బత్తుల లక్ష్మణ్, కోరె కుమారస్వామి, కుండె కిషన్, పాయిరాల వెంకటేష్, పోతరాజు రవి పాల్గొన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వంగపండ్ల మల్లేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గజ్జి మహేష్, ఉపాధ్యక్షుడిగా కుండె కిషన్, సహాయ కార్యదర్శిగా పోతరాజు రవి, గౌరవ అధ్యక్షుడుగా నూకల ఉపేందర్, గౌరవ సలహాదారులుగా సురేందర్, మల్లేష్‌లను ఎన్నుకున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులు చేపడుతున్న నిర్మాణాలకు మండలంలోని పార్వతమ్మ గూడెంతోపాటు ఆయా గ్రామాల చెరువు మట్టి తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రైతులు పంట పొలాలల్లో పోసుకోవాల్సిన చెరువు మట్టి ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులను లూటి చేస్తున్నారని అంటున్నారు.

ఫాదర్స్ డే వేడుకలు

పెద్దవంగర: మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో ఫాదర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ తండ్రులను సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, జలగం చంద్రయ్యలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లికార్జున్, అనపురం రవి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చిన్నగూడూరు: జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆదివారం చిన్నగూడూరు మండల కేంద్రంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న క్రమంలో మండల కేంద్రం శివారు మార్గమధ్యలో ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు స్కిడ్ అయ్యి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించారు.

కేవులతండా శివారులో..

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కేవులతండా గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన డాక్టర్ పరికిపండ్ల అశోక్ మండల కేంద్రానికి చెందిన మచ్చ వీరన్న ద్విచక్ర వాహనంపై చిన్నగూడూరు మండల కేంద్రానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వారి వాహనం కేవుల తండా దాటిన అనంతరం ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడిపోయింది. ఈప్రమాదంలో అశోక్‌కు తీవ్ర గాయాలు కాగా వీరన్నకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.